క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న అబూబకర్ సిద్ధిక్

మదనపల్లె సిటీ: రాష్ట్ర స్థాయి అండర్–14 క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను హెల్పింగ్ మైండ్స్ సభ్యులు గురువారం అభినందించారు. మదనపల్లెకు చెందిన హితేష్, తేజేష్‌లు రాష్ట్ర స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. స్థానిక హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపకుడు అబూబకర్‌సిద్ధిక్ మాట్లాడుతూ భవిష్యత్తులో క్రీడాకారులు ఇరువురూ జాతీయ జట్టుకు ఆడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కిరణ్, చరణ్, జతిన్,హర్ష తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల వితరణ



కూరగాయలు పంపిణీ చేస్తున్న దాదాపీర్

మదనపల్లె సిటీ: స్థానిక కేజీఎస్ మండీ నిర్వాహకులు దాదాపీర్ ఆధ్వర్యంలో మండలంలోని చిప్పిలి గ్రామస్థులకు కూరగాయలు వితరణ చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా ప్రత్యేక వాహనంలో కూరగాయలను తీసుకెళ్లి అందించినట్లు దాదాపీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖాజీపీర్ పాల్గొన్నారు.

నేటి నుంచి పింఛన్ల పరిశీలన

పెద్దమండ్యం: సామాజిక పింఛన్ పొందుతున్న వారి వివరాలను ప్రత్యేక వైద్యుల బృందం పరిశీలించనున్నట్లు ఎంపీడీవో శ్రీధరరావు తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 113 మంది సామాజిక పింఛన్ కింద రూ.15 వేలు పొందుతున్నట్లు తెలిపారు. శుక్రవారం బండమీదపల్లె, వెలిగల్లు, శిద్దవరం గ్రామాల్లో 23 మంది వివరాలను వైద్యులు పరిశీలిస్తారని చెప్పారు. 18న ఎన్‌వోపల్లె, కలిచెర్ల, కోటకాడపల్లె, 22న పెద్దమండ్యం, పాపేపల్లె, 23న సి.గొల్లపల్లె, బండ్రేవు, ముసలికుంట గ్రామాల్లో పింఛను లబ్ధిదారులను బృందం పరిశీలించనున్నట్లు తెలిపారు. పరిశీలన సమయంలో లబ్ధిదారులు తమ వికలత్వ ధ్రువపత్రం, ఆధార్, రేషన్‌కార్డు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

బీజేపీ అధ్యక్షుడిగా శ్రీకాంత్



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దతిప్పసముద్రం: మండల బీజేపీ అధ్యక్షుడిగా మద్దయ్యగారిపల్లికి చెందిన శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని పార్టీ సీనియర్ నాయకులు మల్లెం శివయ్య, పూల నాగరాజు, కార్యం శంకర్, భాస్కర్‌రెడ్డి, సుబ్బమ్మ, వెంకటనారాయణ, వెంకటరమణ తెలిపారు. శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

నేడు నిమ్మనపల్లెలో గ్రామసభ

నిమ్మనపల్లె: నిమ్మనపల్లిలో శుక్రవారం గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. నిమ్మనపల్లి పరిధిలో స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజెస్ అబాడీ – మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) సర్వేలో ఆర్‌ఓఆర్(రికార్డ్ ఆఫ్ రైట్స్)పై గ్రామంలోని మొత్తం ఇల్లు, ఖాళీ జాగాలను సర్వే పూర్తిచేశామన్నారు. ఇందులో ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు, సమస్యలు ఉంటే శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామసభలో తెలియజేయాలన్నారు.

జాగ్రత్తలతో చీడపీడల నివారణ



పురుగు మందును పరిశీలిస్తున్న ఏడీఏ

సిద్దవటం : మండలంలోని వెలుగుపల్లె, జంగాపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలుగుపల్లె గ్రామంలో గ్రామ సభను నిర్వహించి వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, నూతన సాంకేతిక అంశాలను, డ్రోన్ టెక్నాలజీ, ప్రకృతి వ్యవసాయ విధానాలు వివరించడం జరిగిందన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ఈ గ్రామంలో దోస, కర్బూజ, నువ్వులు, వరి, మామిడి, పంటలను సాగు చేస్తున్నారు. దోస ప్రధాన పంటగా సాగు చేసినట్టు తెలియజేశారు. పురుగు ఆశించివుంటే అధికారుల సూచనలతో మందులు పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం ఆయన జంగాలపల్లెలో వరి పంటను పరిశీలించారు. వరిలో చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఇ-పంట నమోదు, జీఎస్టీ బిల్లులు తప్పనిసరిగా ఉండాలన్నారు. అనంతరం సిద్దవటం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతల అసలైన పండగ కనుమ

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె: వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉండే పశువులకు కృతజ్ఞతగా జరిపే అసలైన పండగ కనుమ అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నిసార్ అహ్మద్ పేర్కొన్నారు. కనుమ పండగ సందర్భంగా మండలంలోని కొత్తపల్లె పంచాయతీలో జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. రైతుల సమక్షంలో పాడి ఆవులకు పూజ చేసి హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పశువుల కొమ్ములకు రంగు వేసి, వాటి మెడలో రంగుల పూసలు, గంటలు కట్టి, పసుపు కుంకుమలతో బొట్లు పెట్టి పూజించడంలో పరమార్థం ఏమిటంటే మనకు మేలు చేసిన వారిని మర్చిపోకూడదని చెప్పడమేనన్నారు. కనుమ పండుగ కర్షకుల పండుగని, పాడిపంటలను, పశుసంపదను లక్ష్మీస్వరూపంగా భావించి పూజించడం సంప్రదాయం అన్నారు. కొత్త సంవత్సరంలో పంటలు సమృద్ధిగా పండి, అన్నదాతలు సిరిసంపదలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొత్తపల్లె మహేష్, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, కొత్త ఇండ్లు హబీబ్, చరణ్, చిప్పిలి మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

రామసముద్రం: మండలంలో పశువుల పండగ సంబరాలు అంబరాన్నంటాయి. పెద్దకురప్పల్లె పంచాయతీ పరిధిలోని మట్లవారిపల్లె, నారేవారిపల్లె, తప్పసానిపల్లె తదితర గ్రామాల్లో గురువారం పశువుల పండగ ఘనంగా నిర్వహించారు. వేకువజామున మహిళలు ఇంటి ముందు గొబ్బెమ్మలు పెట్టి రంగు రంగుల ముగ్గులు వేశారు. ఉపవాస దీక్షలతో ఆలయానికి వెళ్లి పూజలు చేసి, పొంగళ్లు కొత్త అల్లుళ్లకు, బంధువులకు పంచిపెట్టారు. పశువుల కొమ్ములను ముస్తాబు చేసి రంగులు వేసి బెలూన్స్ కట్టి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం కాటమరాజు గుడికి తీసుకెళ్లి అక్కడ చిట్లకుప్పలు వేసి పశువులకు చూపించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. సంక్రాంతి పండగ రోజున పల్లెలు బంధువుల రాకతో కళకళలాడాయి.

కలికిరి: మండలంలో గురువారం వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కలికిరి–కలకడ రోడ్డులోని అంకాలమ్మ ఆలయం సమీపంలో కాటమరాజుకు పూజలు నిర్వహించి చిట్లాకుప్పకు నిప్పంటించారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. పశువులను అలంకరించి పశువులతో ప్రదక్షిణలు చేయించారు.



పశువుకు పూజలు చేస్తున్న నిసార్‌అహ్మద్



కాటమరాజుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు



పెద్దకురప్పల్లెలో పశువుల పండగ

అనపకాయలకు మార్కెట్‌లో భలే డిమాండ్



మార్కెట్లో అనపకాయలు

గుర్రంకొండ: సంక్రాంతి నేపథ్యంలో అనపకాయలకు మార్కెట్‌లో భలే డిమాండ్ ఏర్పడింది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో ధర రూ.100 పలుకుతోంది. సాధారణంగా పల్లెల్లో సంక్రాంతి పండగ వారం రోజుల పాటు జరుపుకొంటారు. ఈ వారం రోజుల్లో తప్పని సరిగా ఇళ్లలో ఆనపకాయలు, గింజల కూరలు ఉండాల్సిందే. రోజూ ఉదయం దోసెల్లోకి చట్నీ, సాంబారుకు బదులుగా అనపగింజల కూర ఎక్కువగా తీసుకొంటారు. వీటికి తోడు పగలు, రాత్రిళ్లు ఉడకబెట్టిన ఆనపకాయల్ని స్నాక్స్‌గా తీసుకొంటారు. రాత్రిళ్లు అనపకాయల్ని నీళ్లలో నానబెట్టి ఉదయాన్నే గింజల్ని వంటల్లో వినియోగిస్తుంటారు. ఈ ఏడాది అనప కాయల సాగు తక్కువగా ఉండడం, దిగుబడి అంతంత మాత్రంగా ఉండడంతో మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది.

కిడ్నీ వ్యాధి బాధితురాలికి ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలు

మదనపల్లె: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ అభాగ్యురాలికి దాతలు అండగా నిలిచి ఆర్థికసాయం అందించిన ఘటన గురువారం మదనపల్లెలో జరిగింది. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలం చిన్నపురానికి చెందిన ఓబుల్‌రెడ్డి కుమార్తె కీర్తి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఎలాగైనా బిడ్డను బతికించుకోవాలని పాప తల్లిదండ్రులు తమ వద్ద ఉన్నదంతా ఖర్చుచేశారు. అయినా ఫలితం లేకపోవడంతో బిడ్డను బతికించుకునేందుకు కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దాతల దృష్టికి తెచ్చారు. దీంతో తంబళ్లపల్లె మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి రూ.25 వేలు, రోజాహోటల్ కంభం నాగభూషణ్‌రెడ్డి రూ.5,116, రిటైర్డ్ ఇంజనీర్ ఎస్.రాజగోపాల్‌రెడ్డి రూ.5 వేలు, అంకిశెట్టిపల్లె రెడ్డిశేఖర్‌రెడ్డి రూ.5వేలు, ఇతరులు మొత్తం కలిపి రూ.70,350 రూపాయలు తమవంతుగా ఆర్థిక సహాయాన్ని కీర్తి తండ్రి ఓబుల్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రెడ్డినాడు రామమోహన్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, మంజునాథరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత



మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలికిరిలోని నల్లారి తిమ్మారెడ్డి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే ప్రజలలో వ్యతిరేకత పతాక స్థాయికి చేరిందన్నారు. ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా పాలన సాగిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. ఎక్కడ ప్రజలు నిలదీస్తారోనని నేతలు ప్రజల్లోకి రాకుండా భయపడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన పథకాలలో ఒక్క పథకాన్ని అమలు చేయకుండా నిర్వీర్యం చేయడం దారుణమన్నారు. విద్యుత్తు చార్జీల బాదుడుతో ప్రజల నెత్తిన మోయలేని భారం వేశారన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

మండలంలోని మేడికుర్తి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు దిలావర్‌ఖాన్ కుమారుడి వివాహం కలికిరిలోని అజయ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగింది. పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌కు చేరుకుని వధూవరులను ఆశీర్వదించారు. అంతకు మునుపు వాల్మీకిపురం మండలం నాగంవారిపల్లి నందు మదనపల్లికి చెందిన కనుగొన్న మద్దిరెడ్డి నిర్వహించిన నాగుల రాళ్ళ హోమం, కళ్యాణోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నల్లారి తిమ్మారెడ్డి, నీళ్ల భాస్కర్, రమేష్‌కుమార్‌రెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, రౌనక్ బాషా, డాక్టర్ ఏవీ.రమణ, అల్లాబక్ష్, వెంకటపతి, ఖాదర్‌బాషా, వై.ఆదినారాయణరెడ్డి, ప్రభాకర్, జగన్‌మోహన్, అక్రమ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రాలు నిర్మించాలి



లఘు చిత్రానికి క్లాప్ కొడుతున్న మునిరత్నం

మదనపల్లె సిటీ: సమాజం కోసం సందేశాత్మక చిత్రాలు నిర్మించాలని బీటీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం అన్నారు. స్థానిక బైపాస్‌రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో పునర్జన్మ లఘు చిత్రం చిత్రీకరణను ఆయన ప్రారంభించారు. మునిరత్నం మాట్లాడుతూ అవయవదానం ఎంతో ప్రాముఖ్యత వహిస్తుందో తెలియజేస్తూ పునర్జన్మ లఘు చిత్రం నిర్మించడం జరుగుతోందన్నారు. చిత్ర దర్శకులు పీఎస్.నారాయణ మాట్లాడుతూ అవయవదానాలపై సమాజాన్ని మేల్కొల్పి ప్రజలను చైతన్యపరచాలనే సంకల్పంతో చిత్రాన్ని తీస్తున్నట్లు తెలిపారు. ఈ లఘుచిత్రంలో సంగారెడ్డి, సుమ, బేబీ భవ్యశ్రీ, జన్ను, వెంకటరమణారెడ్డి, గొల్లపూడి తిరుపతిరావు, నివేదిత,ప్రసాదరావు, సీతాజాహ్నవి తదితరులు నటిస్తున్నారన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ .. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మండలంలోని కురవంక, కోళ్లబైలు–1, 2 పంచాయతీల్లో రూ.1.5 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందన్నారు. నియోజక వర్గంలోని అన్ని పంచాయతీల్లో సీసీ రోడ్డు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లే హారతి, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, వైస్ సర్పంచ్ భారతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కనకదాస జయంత్యుత్సవాలకు మంత్రికి ఆహ్వానం



ఉత్సవాలకు మంత్రిని ఆహ్వానిస్తున్న శ్రీనివాసులు, తదితరులు

మదనపల్లె: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కురుబ, కురుమ, కురువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కనకదాసు జయంతి ఉత్సవాలకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను ఆహ్వానించినట్లు సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. మీడియాతో గురువారం ఆయన మాట్లాడుతూ.. జనవరి 23న పట్టణంలోని రామతులసీ కల్యాణమండపంలో కనకదాస జయంతి ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా కురుబ కులానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానిస్తామని తెలిపారు. ఉత్సవాల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.కే.శ్రీనివాసులు, మర్రిపాడు రమేష్, మనోహర, కప్పలరాజన్న, జబ్బలరెడ్డెప్ప, గుడిరామాంజులు, గోవిందు, కొప్పలచిన్నప్ప, జనార్దన్‌నాయుడు, జబ్బలచంద్ర, శివన్న, మణి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టండి



సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ లక్ష్మన్న

పెద్దతిప్పసముద్రం: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మమేకమై అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని ములకలచెరువు సీఐ లక్ష్మన్న సూచించారు. పెద్దతిప్పసముద్రం పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించి రైతు రెడ్డెప్ప(56) అనుమానాస్పద మృతిపై కుటుంబీకులు, గ్రామస్థులతో వేర్వేరుగా విచారణ చేపట్టారు. రెడ్డెప్పది సాధారణ మరణమేనని, తమకు ఎవరిపై ఎలాంటి అనుమానాలు లేవని, పోలీస్ కేసు అవసరం లేదని కుటుంబ సభ్యులు సీఐ ఎదుట వెల్లడించారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరించినా, జూదం నిర్వహించినా, ప్రమాద సంఘటనలు చోటు చేసుకున్నా తక్షణమే సీఐ 9440796720, ఎస్‌ఐ 9440900716 ఫోన్ నంబర్లకు తెలిపి సహకరించాలని ప్రజలకు సూచించారు.

పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

పెద్దమండ్యం: పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యర్రగుట్టపల్లెకు చెందిన బైన మధుకరరెడ్డిని జిల్లా వైఎస్సార్‌సీపీ యాక్టివిటీ కార్యదర్శిగా నియమించడంతో సదుంలోని పెద్దిరెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం రమేష్, సర్పంచులు జింకా విశ్వనాథ్, కంటి విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ మంచూరి జయరాం, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలి, జెఎస్‌వీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, నాయకులు రామక్రిష్ణ, మధురెడ్డి, కోట్ల విశ్వనాథరెడ్డి, నిరంజన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి



విజేత జట్టుకు చెక్కు అందజేస్తున్న శ్రీరామ్ చినబాబు, సర్పంచ్ చలపతి తదితరులు

మదనపల్లె: మదనపల్లె క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి విజేతలుగా ఎదగాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు అన్నారు. మండలంలోని చిప్పిలిలో పీఎస్సార్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో గెలుపొందిన హనుమాన్ జట్టుకు, శ్రీరామ్ చినబాబు, కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి, రాజంపేట పార్లమెంటరీ టీడీపీ ప్రధాన కార్యదర్శి యాలగిరి దొరస్వామినాయుడు చేతుల మీదుగా రూ.25 వేల నగదు, మొమెంటో అందజేశారు. శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో స్థానిక యువతను ప్రోత్సహించేలా క్రీడల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఓటమిచెందిన చిప్పిలి అట్టాకర్స్ మరో మ్యాచ్‌లో గెలుపొందాలని ఆకాంక్షించారు. ఓడిన జట్టుకు రూ.15 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మోడెం శివకుమార్, మహబూబ్‌ఖాన్, పసుపులేటి శశికుమార్, మహమ్మద్ రఫీ, చిరు, శ్రీనాథ్‌రెడ్డి, బయ్యారెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు

నిమ్మనపల్లె: వెనుకబడిన కులాలకు చెందిన లబ్ధిదారులు బ్యాంకు లింకేజీ రాయితీ రుణాలకై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ద్వారా బీసీ, ఈబీసీ, కాపు(కాపు, బలిజ, తెలగ, ఒంటరి) కులా లబ్ధిదారులకు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ లో జనవరి 16 తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సాంకేతిక కారణాలతో వెబ్‌సైట్ అందుబాటులో లేదని, వచ్చిన వెంటనే తేదీలను ప్రకటిస్తామన్నారు.

కురబలకోటలో హై అలెర్ట్!

- నేడు పోలీస్ యాక్ట్ అమలు
- డీఎస్పీ కొండయ్య



డీఎస్పీ కొండయ్య నాయుడు

కురబలకోట: కురబలకోట మండల పరిషత్ కార్యాలయంతోపాటు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం పోలీస్ యాక్టు అమలులో ఉన్నట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య తెలిపారు. కురబలకోట మండల మీట్ జరగనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం సమావేశం ప్రశాంతంగా నిర్వహించడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, జనం గుమికూడినా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండల పరిషత్ పరిసర ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించినట్లు తెలిపారు. మండల మీట్ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. రెవెన్యూ 144, 30 పోలీస్ యాక్టు, 163 కొత్త చట్టం అమలులో ఉన్నట్లు తెలిపారు. చట్టాలను అతిక్రమిస్తే కటకటాల పాలు కాక తప్పదని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించరాదని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రాంతంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, భేటీలు నిర్వహించరాదన్నారు. ఆంక్షలు, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించారు. కార్యాలయం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామని, అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని ఆయన తెలిపారు. ఆయన తెలిపారు. ఆయన వెంట ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

మండల మీట్‌ను అడ్డుకోవద్దు

టీడీపీ నాయకులు దాసరిపల్లె జయచంద్రారెడ్డి

కురబలకోట: శుక్రవారం జరగాల్సిన కురబలకోట మండల మీట్‌ను ఎవరూ అడ్డుకోవద్దని తంబళ్లపల్లె నియోజకవర్గ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారంజడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడుతో శుక్రవారం జరగాల్సిన మండల మీట్‌పై చర్చించారు. అనంతరం కూటమి నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరేమనుకున్నా శుక్రవారం జరగనున్న మండల మీట్‌కు సజావుగా సాగేందుకు సహరించాలని కోరారు. ఐదుగురు ప్రత్యేక ఆహ్వానితులను మండల మీట్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని జడ్పీ సీఈఓను ఆయన కోరారు. తరచూ మండల మీట్‌ను అడ్డుకుంటే ప్రజల్లో వ్యతిరేక భావన నెలకొనే అవకాశం ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున వివిధ శాఖల కింద మంజూరైన నిధులను వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. జడ్పీ నిధుల నుంచి రూ.34 లక్షలు తాగునీటి సౌకర్యం కోసం మండలానికి కేటాయించారని, వాటిని వినియోగించుకోవాలన్నా మండల మీట్ జరగాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు రావడానికి ఎవ్వరూ ఆటంకం కల్పించరాదని కోరారు. సీడ్ మల్లిఖార్జున నాయుడు, తహసీల్దారు తపస్వి, ఎస్‌ఐ దిలీప్‌కుమార్, ఎంపీడీఓ గంగయ్య, వైజీ.రమణ, వైజీ.సురేంద్రయాదవ్, తుమ్మచెట్లపల్లె సూరి పాల్గొన్నారు.

పొగమంచుతో పంటకు నష్టం



ఉలవ పంటలో పొగమంచు

రామాపురం : ఏటా కొండంత పంటల సాగుపై రైతన్నల ఆశలు ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో ఊరిస్తున్న రుతుపవనాలు కొద్దోగొప్పో పంటల సాగు చేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూపే మిగులుతోంది. మండలంలో సాధారణ పంట సాగు సుమారు వెయ్యి హెక్టార్లకుపైగా ఉన్నా ఇందులో 20శాతం పంట సాగుకు నోచుకోలేదు. అందునా ఈ యేడు వర్షాభావం కారణంగా వేరుశనగ పంట స్థానంలో ఉలవ పంటను సాగు చేశారు. ఇందులో అంతర పంటగా, సాధారణంగా 180 హెక్టార్లలో సాగు చేశారు. పంట ఏపుగా పెరిగినా 20 రోజుల్లో కోతకు వచ్చే తరుణంలో గత వారం రోజులుగా ఉదయం 6గంటలపాటు ప్రతి రోజు పొగమంచు కారణంగా సాగు చేసిన ఉలవ, కంది, మామిడిపూత(తోటలు), అనప, అలసంద పంటలు ఇతరాత్ర పంటలు దెబ్బతినే స్థితికి చేరుకుంటున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. పెట్టిన ఫలసాయం కూడా అందే పరిస్థితి లేదంటున్నారు. నవంబర్, డిసెంబర్ మాసంలో తుపానులు కాగా ఇప్పుడు పొగ మంచు వల్ల రైతుల కోలుకొనే స్థితి లేదంటున్నారు. ప్రభుత్వం తమకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని మండల రైతాంగం విన్నవిస్తున్నారు.